



నేటి నుంచి ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలు



- విశాఖలో నేడు భారీ ర్యాలీ, బహిరంగ సభ
- హాజరవుతున్న జాతీయ నాయకులు
- 'మహిళా హక్కుల సంరక్షణ.. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ' ధ్యేయంగా పోరాటాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలకు పారిశ్రామిక నగరం విశాఖ వేదికవుతోంది. ఈ నెల 22 గురువారం నుంచి 25 వరకూ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ సమావేశాలు జరగనున్నాయి. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సరస్వతి పార్క్ నుంచి మహిళల భారీ ప్రదర్శన.. అనంతరం సెంట్రల్ పార్క్ వద్ద బహిరంగ సభ ఉంటాయి. ముఖ్య వక్తలుగా సంఘం అఖిల భారత కార్యదర్శి మరియం థావలే, అఖిల భారత కోశాధికారి ఎస్.పుణ్యవతి, వక్తలుగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి పాల్గొననున్నారు. 'ప్రజాస్వామ్యం - సమానత్వం - స్త్రీ విముక్తి' నినాదాలతో మహిళా సమస్యలపైనా, దేశంలో జరుగుతున్న అన్ని రకాల వేధింపులపైనా నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలకు ఉద్యమ విశాఖ వేదిక కావడం విశేషం. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం వంద శాతం అమ్మకానికి పెట్టడాన్ని మూడేళ్లుగా వ్యతిరేకిస్తూ ఐద్వా ఆధ్వర్యాన మహిళలు పెద్ద ఎత్తున కార్మికోద్యమంలోనూ, కార్మిక కుటుంబాలతోనూ మమేకమై పోరాడుతూనే ఉన్నారు. ఒకవైపు మహిళా హక్కుల సంరక్షణ, వివిధ రంగాల్లో మహిళల శక్తి సామర్థ్యాల మెరుగుదల కోసం, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతోనే ఉద్యోగాలు, ఉపాధి, మహిళలకు ఆసరా లభిస్తుందన్న నినాదంతో ఐద్వా ముందుకు సాగుతోంది.

విశాఖలో ప్రస్థానమిలా..

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల్లో 1990వ దశకం నుంచి విశాఖ కేంద్రంగా ఐద్వా ఉద్యమిస్తోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ స్థాపన కోసం జరిగిన పోరాటంలో 1970-80వ దశకంలో ఐద్వా నేతలు ఎస్.పుణ్యవతి, వై.ధర్మారం, డి.శారద సహా పలువురు మహిళలు భాగస్వామ్యమయ్యారు. ప్లాంట్‌ను నిలబెట్టుకునే పోరులోనూ ఇదే ఒరవడిని ఐద్వా కొనసాగిస్తోంది. విశాఖ షిప్‌యార్డు ప్రైవేటీకరణకు, డాక్‌యార్డులో ఆఫ్ లోడింగ్‌కు వ్యతిరేకంగా డాక్‌యార్డు గేటు వద్ద పెద్ద ఎత్తున 1990వ దశకంలో పోరాడిన చరిత్ర ఐద్వాకు ఉంది. బిహెచ్‌పివిని మూతవేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్న క్రమంలోనూ ఆందోళనలు చేపట్టింది. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ)ను కేంద్రంలోని మోడీ సర్కారు ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 2017-18 కాలంలో జరిగిన ఆందోళనల్లో ఐద్వా భాగస్వామ్యమైంది. డిసిఐ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చేయడంలో సఫలీకృతమైంది.

ఎంతో ఘన చరిత్ర

ఐద్వాకు దేశంలో కోటి మందితో కూడిన సభ్యత్వం ఉంది. స్త్రీల రక్షణ కోసం అనేక చట్టాలు రావడంలో ఐద్వా కీలకపాత్ర పోషించింది. 2014లో మొట్టమొదటసారి కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్త్రీల హక్కులు, స్వేచ్ఛను కాలరాస్తోందని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి తెలిపారు. కులం, మతం, ప్రాంతం కట్టుబాట్లతో అణచివేయడానికి చూడడంతో ప్రపంచంలోనే మన దేశం మహిళల హింసలో ప్రథమ స్థానంలోకి నెట్టబడిందన్నారు. బిజెపి విధానాలే దీనికి కారణమని తెలిపారు. హక్కులపై మహిళలను ఒకతాటిపైకి తీసుకొచ్చేందుకు విశాఖలోని జాతీయ కార్యవర్గ సమావేశాలు దోహదపడనున్నాయని తెలిపారు.

జయప్రదం చేయండి : ఐద్వా జిల్లా కమిటీ పిలుపు

కలెక్టరేట్ : విశాఖలోని సెంట్రల్ పార్కు వద్ద ఐద్వా ఆధ్వర్యాన గురువారం జరుగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సంఘం విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి మహిళాలోకానికి పిలుపునిచ్చారు. జాతీయ కార్యవర్గ సమావేశాల్లో దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులు, గృహహింస, అత్యాచారాలు, శ్రామిక మహిళలపై వేధింపులు, 2024లో జరగబోయే ఎన్నికల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్లు అమలు వంటి అంశాలపై చర్చ జరుగనుందని వెల్లడించారు.

పిఠాపురంకాలనీలో సంత కొనసాగించాలి : సిఐటియు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 22వ వార్డు పిఠాపురంకాలనీ కళాభారతి రోడ్డు మార్గంలో సోమవారం సాయంత్రం జరిగే సంతను కొనసాగించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. పిఠాపురం కాలనీలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 16ఏళ్లుగా సాగుతున్న సంతను వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అక్రమంగా తొలగించడం సరైంది కాదన్నారు. సంత వ్యాపారస్తుల సంఘంతో కనీసం మాట్లాడకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా అర్ధాంతరంగా నిలిపివేయడం అన్యాయమన్నారు. 2014 వీధి విక్రయదారుల చట్టం, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సంత వ్యాపారస్తులకు ఉపాధి రక్షణను ప్రభుత్వం కల్పించాలన్నారు. దీనిపై ఈ నెల 23వ తేదీన కళాభారతి జంక్షన్‌లో నిరసన చేడతామన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు కె.కుమారి, అనపర్తి అప్పారావు, బుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యునిగా బాబూరావు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో వైసిపి నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్ దాఖలుచేశారు. నామినేషన్ల గడువు మంగళవారం ముగిసే నాటికి సింగిల్ నామినేషన్లు పడ్డంతో ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

సిఎం, గవర్నర్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-విశాఖపట్నం : పెందుర్తి మండలం చినముషిడివాడలోని శ్రీ శారదా పీఠంలో నిర్వహించే రాజశ్యామలయాగంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, మిలాన్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి ప్రత్యేక విమానంలో బుధవారం ఉదయం 11.48 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని, రాజ్యసభ సభ్యులు వైవి. సుబ్బారెడ్డి ఉన్నారు. విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవివి.సత్యనారాయణ, బివి.సత్యవతి, గొడ్డేటి మాధవి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎస్.రవిపట్టన్‌శెట్టి, విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

భారత ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్‌తో కలిసి గురువారం మిలాన్ - 2024 వేడుకల్లో పాల్గొనేందుకు బుధవారం సాయంత్రం 5.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫక్కీరప్ప, జడ్‌పి సిఇఒ ఎం.పోలినాయుడు, రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న బూడి, అమర్‌నాథ్

సిపిఎం నేతల గృహ నిర్బంధం

ముఖ్యమంత్రి వస్తే అరెస్టులు చేయడం అమానుషం

ప్రజాశక్తి-కలెక్టరేట్ : పెందుర్తి మండలంలోని శారదాపీఠంలో బుధవారం నిర్వహించిన రాజశ్యామల యోగంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో బుధవారం ఉదయం సిపిఎం నాయకులను గృహ నిర్బంధం చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడును, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్‌ను వారి ఇళ్ల వద్ద పోలీసులు నిర్బంధించారు.

అరెస్టులు అమానుషం

ముఖ్యమంత్రి విశాఖ వస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లాకార్యదర్శి వర్గసభ్యులు బి.జగన్‌లను ప్రభుత్వం గృహ నిర్బంధం చేయటాన్ని పార్టీ విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటన విడుదలచేశారు. తెల్లవారక ముందే పోలీసులు వచ్చి నాయకుల ఇళ్లను చుట్టుముట్టారన్నారు. ముఖ్యమంత్రి వస్తే సిపిఎం నేతలు ఇళ్ల నుంచి బయటకు రాకూడదా, ప్రజా సమస్యలపై రోజువారీ కార్యక్రమాలు, నిరసనలు చేయనివ్వరా, నాయకులను గృహ నిర్బంధం చేస్తే ప్రజల నిరసనలు ఆగిపోతాయా అని ప్రశ్నించారు. ప్రజల సమస్యలు 90 శాతం పరిష్కరించామని జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారని, అంత బాగా పాలన ఉంటే ముఖ్యమంత్రి నిరసనలకు ఎందుకు భయపడాలి? నిర్బంధానికి ఎందుకు పూనుకోవాలి? అని ప్రశ్నించారు. దీనిని బట్టే జగన్ ప్రభుత్వ పాలన ప్రజా కంటకంగా ఉందని అర్థం అవుతోందన్నారు. విశాఖలో ప్రజల సమస్యలు కోకొల్లలు గా ఉన్నాయని తెలిపారు. బాధ్యతగల ముఖ్యమంత్రి అయితే ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతిపక్షాలకు, ప్రజలకు, ప్రజా సంఘాలకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. కానీ ఇంటి నుంచి కాలు బయటకు పెట్టేందుకు ఈ ప్రభుత్వం అవకాశం ఇవ్వడం లేదని తెలిపారు. అధికార మదంతో ప్రజల గొంతు నొక్కి, ప్రతిపక్షాలపై నిర్బంధాలకు పూనుకున్న ఏ ప్రభుత్వమూ బతికి బట్ట కట్టలేదని, ఇది చరిత్ర చెప్పిన సత్యం అని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ వాస్తవాన్ని గ్రహించాలని పేర్కన్నారు. నిర్బంధ చర్యలు ఆపకపోతే ఈ ప్రభుత్వానికి గత పాలకులకు పట్టినగతే పట్టక తప్పదని హెచ్చరించారు.

సిపిఎం నాయకుల గృహ నిర్బంధాన్ని విశాఖ పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కెఎం.శ్రీనివాసరావు, కో కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తీవ్రంగా ఖండించారు.

అనకాపల్లి : సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.జగన్‌లను అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పోలీస్ అధికారులు పోలీస్ మాన్యువల్‌ను అమలు చేయకుండా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు. పోలీసులే చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని, ముఖ్యమంత్రి తన సొంత పనులపై యజ్ఞాలు, పూజలు, పెళ్లిళ్లకు వచ్చిన ప్రతిసారీ సిపిఎం కార్యకర్తలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంలో చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. అధికార పార్టీ సామాజిక యాత్రల సందర్భంగా కూడా అనకాపల్లి జిల్లాలో సిపిఎం నాయకులు అక్రమంగా నిర్బంధించి ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ నిరసన తెలియజేసే హక్కు ఉందని, ప్రశ్నించడాన్నే ఈ ప్రభుత్వం సహించలేక పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

విశాఖకు ఎన్ని పరిశ్రమలు తెచ్చారో అమర్‌నాథ్ చెప్పాలి

మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పరిశ్రమ శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్‌నాథ్ తాను నివసిస్తున్న విశాఖ జిల్లాకు ఎన్ని పరిశ్రమలు తెచ్చారో చెప్పాలని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్, ఈనాడు సంస్థలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. రెండు నెలలు తర్వాత తాము అధికారంలో వస్తామని, అప్పుడు సాక్షి సోదరులకు ఎవరు భద్రత కల్పిస్తారని ప్రశ్నించారు. శారద పీఠానికి సిఎం జగన్ వస్తే ఇన్ని ఆంక్షలు పెట్టడం దారుణం అన్నారు. కర్ఫ్యూ లాంటి పరిస్థితి ఉండడంపై జగన్ విశాఖ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కొడాలి నాని, గంజాయి నాని అని విమర్శించారు.

అనుమతుల్లేని చేపల చెరువులను మూసివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎటువంటి అనుమతి లేకుండా చేపల చెరువులు నిర్వహిస్తున్నారని, తక్షణమే వాటిని మూసివేసి, నిర్వాహకులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కొత్తపెంట, కలిగొట్ల, ములకాలాపల్లి, పెదనందిపల్లి, తారువా తదితర గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న చేపల చెరువులను బుధవారం వారు పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇతర జిల్లాల వ్యాపారులు దేవరాపల్లి మండలంలోని రైతులకు డబ్బులు ఆశ చూపించి భూములు లీజుకు తీసుకొని, ఎటువంటి అనుమతుల్లేకుండానే చేపలు చెరువుల తవ్వకాలు చేశారని తెలిపారు. ఈ విధంగా మండలంలో దాదాపుగా వెయ్యి ఎకారాల్లో చేపల చెరువులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ చెరువుల్లో చేపల పెంపకం కోసం పశు మాంసం, చికెన్ వ్యర్థాలు, చని పోయిన గొర్రెలు, మేకలను, బ్రాండిక్స్, ఇతర క్యాంటీన్లలో వ్యర్థాలను వేస్తున్నారని పేర్కొన్నారు. రైవాడ రిజర్వాయర్ నీటిని చేపలు చెరువలకు వాడుకుంటూ, వృథా నీటిని కింది పొలాలకు విడిచిపెట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి సొంత మండలం కావడంతో వీటిపై చర్యలకు అధికారులు భయపడుతున్నారన్నారు. మామూళ్లకు ఆశపడి ఈ అక్రమ చెరువులకు అధికార పార్టీ నాయకులు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గం అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

ప్రజాశక్తి-చోడవరం : వైసిపి ఐదేళ్ల కాలంలో చోడవరం నియోజకవర్గానికి రూ.3వేలు కోట్లు నిధులు తెచ్చామని చెబుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, నియోజకవర్గం అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి మల్లునాయుడు సవాల్ విసిరారు. చోడవరం బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై తాము మాట్లాడితే ఎమ్మెల్యే ధర్మశ్రీ ఎందుకు అసహనానికి గురవుతున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ధర్మశ్రీ అవినీతిపై ఆ పార్టీ నాయకులే విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు, పోలీసులు వద్ద కూడా ఎమ్మెల్యే ధర్మ శ్రీ డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు అల్లం రామప్పరావు, జి మోలునాయుడు, కర్రి రమేష్, టిడిపి నాయకులు సిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యన్న విద్యా సంస్థల వార్షికోత్సవం

ప్రజాశక్తి- కె.కోటపాడు : స్థానిక అయ్యన్న విద్యాసంస్థల వార్షికోత్సవ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఖాసీం అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో నన్నయ యూనివర్సిటీ పూర్వపు వైస్ ఛాన్సలర్ డాక్టర్ ముర్రు ముత్యాల నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని, దానిని ఉపాధ్యాయులు అలవర్చాలని సూచించారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, మాజీ జెడ్పిటిసి కసిరెడ్డి అప్పలనాయుడు, అపుస్మా ప్రతినిధి వైవి రావు, సంజీవిని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ డేనియల్, బండారు రామస్వామి పాత్రుడు మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మర్రెడ్డిపై దాడి అమానుషం

ప్రజాశక్తి -మునగపాక : తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరావుపై దాడి అమానుషమని, దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి దాడి ముసలి నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిపై దుండగులు ఇనపరాట్లతో దాడి చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్ల వరాహనరసింగరావు, ఆడారి గోవిందరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం -అనకాపల్లి రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం



సమావేశంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, మండల నాయకులు

ప్రజాశక్తి- అచ్యుతాపురం

నిత్యం ప్రమాదాలకు నిలయమైన అచ్యుతాపురం -అనకాపల్లి ప్రధాన రహదారి పునర్నిర్మాణ పనులు వెంటనే మొదలు పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని హరిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన సిపిఎం అచ్యుతాపురం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రహదారిపై పడిన గోతులను పూర్చడానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్థానికులు సొంత ఖర్చులతో వారి గ్రామాలలో స్వచ్ఛందంగా గోతులను పూడ్చుకుంటున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరూ రోడ్డు బాగు చేయాలని అచ్యుతాపురం నుండి అనకాపల్లి వరకు పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించి ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లారని గుర్తు చేశారు. ప్రజా ఆందోళనలతో స్పందించిన ప్రభుత్వం రహదారి పునర్నిర్మానానికి రూ.6.50 కోట్లు మంజూరు చేసి పది రోజులైనా ఇంకా పనులు మొదలుపెట్టలేదన్నారు. సకాలంలో రోడ్డు పనులు ప్రారంభించక పోతే మళ్ళీ ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, సీనియర్ నాయకులు కే.రామ సదాశివరావు, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, కన్నం నాయుడు, బాబురావు, రాంకుమార్, ఎస్ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం



సబ్బవరం సర్వే నెంబర్ 271లో కబ్జాకు గురైన స్థలం ఇదే...

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 271లో సుమారు 10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి భూ కబ్జాకు గురైంది. సబ్బవరం సాయినగర్ కాలనీ 40 అడుగుల రోడ్డులో వాటర్ ట్యాంకు, అంగన్వాడి సెంటర్‌ను ఆనుకొని ఉన్న సుమారు ఒక ఎకరానికి పైగా ప్రభుత్వ భూమిని పలు ప్రభుత్వ కార్యాలయాలకు, కమ్యూనిటీ హాల్‌కు, కల్యాణ మండపానికి అప్పట్లో పాలకులు కేటాయించారు. ఆ భూమిని అప్పట్లో కొందరు కాజేసేందుకు ప్రయత్నించగా పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు ఆ భూమిలో ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సబ్బవరం పంచాయితీకి చెందిన ప్రతినిధులు భూకబ్జా చేస్తుండడంతో సాయినగర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని వారు ఆరోపిస్తున్నారు. తక్షణమే రెవెన్యూ యంత్రాంగం ఈ భూకబ్జాపై దృష్టి సారించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఇరువాడలో గెడ్డ వాగు ఆక్రమణ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఇరువాడ గ్రామంలో ప్రభుత్వ గెడ్డవాగును దర్జాగా కబ్జా చేశారు. ఇరువాడ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 176లో సుమారు 60 సెంట్లు ప్రభుత్వ గెడ్డవాగు ఉంది. ఈ స్థలాన్ని గతంలో అంగన్వాడీ కేంద్రానికి కేటాయించారు. ఈ స్థలంలో కొంతమంది అక్రమ కట్టడాలు చేస్తున్నారు. అయినప్పటికీ రెవిన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. స్థానిక ప్రతినిధులకు అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకొని అక్రమ కట్టడాలను నిలిపేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

మలసాల కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టింది టిడిపి

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ రాజకీయ భిక్ష పెట్టిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ అన్నారు. గవరపాలెం టిడిపి పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మలసాల భరత్ కుమార్ అనకాపల్లికి ఒక రాజకీయ టూరిస్ట్ గా వచ్చారని, ఆయనకు నియోజకవర్గ సరిహద్దులు తెలియదని ఎద్దేవా చేశారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అవినీతి జగన్ రెడ్డికి తెలిసే అనకాపల్లి సీటు ఇవ్వలేదన్నారు. మలసాల కుటుంబం టీడీపీ పార్టీకి చేసిన ద్రోహం గురించి ప్రజలందరికీ వివరిస్తామన్నారు. కార్యక్రమంలో నారపిన్ని చంద్ర శేఖర్, కర్రి బాబీ, తలారి కాశీనాయుడు, శెట్టి వెంకట రమణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణల్లో వాస్తవం లేదు

ప్రజాశక్తి-అచ్చుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజుపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని వైసిపి ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో జడ్పిటిసి లాలం రాంబాబు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నర్మల కుమార్, పార్టీ సీనియర్ నాయకుడు కోన లచ్చన్న నాయుడు, ఒడిసెల శ్రీనివాసరావు, దేశం శెట్టి శంకర్రావు, పి వాసు రాజు, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని గాలి భీమవరం ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఐద్వా జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 23 నుండి 25 వరకు జరిగే విశాఖలో జరుగు ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఐద్వా జాతీయ సమావేశాల గోడ పత్రికను స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం మహిళా సమస్యలపై పోరాటాల నిర్వహిస్తున్న ఐద్వా ఆలిండియా సమావేశాలు విశాఖపట్నంలో జరగడం హర్షించదగిన విషయమన్నారు. ఐద్వా నాయకులు డిడి.వరలక్ష్మి, జి.సుభాషిణి, కె.సూర్యప్రభ, ఆర్.లక్ష్మి, యు.నాగమణి పాల్గొన్నారు.

కశింకోట : ఐద్వా జాతీయ సమావేశాలు సందర్భంగా ఈ నెల 22న గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు విశాఖపట్నంలో సరస్వతి పార్కు నుండి సెంట్రల్ పార్క్ వరకు మహిళా హక్కుల పరిరక్షణకై ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందని, ఇందులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయద్రం చేయాలని జిల్లా నాయకురాలు డిడి.వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఐద్వా జాతీయ సమావేశాలు గోడ పత్రికను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమ్మాజీ, సూర్యలక్ష్మి, శ్రీదేవి, మాలెమ్మ, సాయిరాం ,పూర్ణమ్మ, పెంటమ్మ, లక్ష్మి, పాల్గొన్నారు.

రైతులకు భూమి పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కూండ్రం గ్రామ సచివాలయంలో బుధవారం ఎంపిపి గొర్లి సూరిబాబు చేతుల మీదుగా జగనన్న శాశ్వత భూహక్కు పథకం కింద రైతులకు భూమి పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేనాపతి పెంటరావు, గ్రామ సర్పంచ్ నందారపు లక్ష్మి సూరిబాబు, యాదగిరి తాతయ్యనాయుడు, నక్కరాజు ప్రభాకర్, యలమంచిలి ప్రసాద్, మొల్లి గంగునాయుడు సేనాపతి లక్ష్మణరావు, బొబ్బరి శ్రీను, గ్రామ కార్యదర్శి కె శ్రీనివాసరావు, వీఆర్వో అనంతరామయ్య పాల్గొన్నారు.

ఎపిపిఎస్‌సి పరీక్షలకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 25వ తేదీన నిర్వహించే ఏపీపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 8924222888 కు ఫోన్ చేసి పరీక్షల సమాచారాన్ని పొందవచ్చున్నారు.

జివిఎంసి డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి నడిబొడ్డున ఉన్న జీవీఎంసీ డంపింగ్ యార్డ్‌ను తరలించాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డంపింగ్ యార్డ్ వల్ల అనేక రకాలైన రోగాలకు ప్రజలు గురవుతున్నారు. డంపింగ్ యార్డ్‌కి సమీపంలోనే జీవీఎంసీ హైస్కూల్, కాలేజ్ ఉండటం వలన మధ్యాహ్నం భోజనాలు చేసేటప్పుడు కూడా ఎంత ఇబ్బందికి గురవుతారో అధికారులు ప్రజాప్రతినిధులు అర్థం చేసుకోవాలన్నారు. జనసేన పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వికలాంగులకు ఐడి కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : వికలాంగులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన యూనిక్ ఐడి కార్డులను మండలంలోని రాజాంలో సర్పంచ్ మరిసా నాని బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరిసా అప్పలనాయుడు, వికలాంగుల ప్రతినిధి జెర్రిపోతుల తాత రాజు, సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గమనిక

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కేంద్రంలోని ప్రింటింగ్ మెషిన్ మెయింటినెన్స్ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 22.02.2024 గురువారం నుంచి 8 పేజీల విశాఖ, అనకాపల్లి టాబ్లాయిడ్ స్థానంలో బ్రాడ్ షీట్ పేజీలు (పెద్దవి) సుమారు 15 రోజులుపాటు రానున్నాయి. ఆ తర్వాత యథావిధిగా టాబ్లాయిడ్ కొనసాగనుంది. సహకరించాలని కోరుతున్నాం.

- జనరల్ మేనేజర్, విశాఖపట్నం

ఇదెక్కడి చోద్యం!

- ముఖ్యమంత్రి వస్తే అన్నీ మూసేయాలా?

ప్రజాశక్తి-పెందుర్తి : ముఖ్యమంత్రి వస్తే రోడ్డుపై ఏమీ కనిపించకుండా అన్నీ మూసేయాలా? ఇదెక్కడి చోద్యమని యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షఫీ ఎద్దేవా చేశారు. బుధవారం కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చిన్నముషిడివాడలోని శారదాపీఠం సందర్శన వంటి దాదాపు వ్యక్తిగత కార్యక్రమానికి సిఎం జగన్ రాకను పురస్కరించుకుని, మంగళవారం సాయంత్రం నుంచే ఎన్ఏడి నుంచి చినముషిడివాడ వరకు రోడ్డుకిరువైపులా ఖాళీ చేసేశారని, రోడ్డుపక్కన ఉండే చిరువ్యాపారాలు, తోపుడుబళ్లను నిలిపేశారన్నారు. ఇక పోలీసులకు ఇరువురోజులుగా ఇదే పని, ప్రజలకు ఒకటే పరేషాన్ అని అసహనం వ్యక్తం చేశారు. శారదాపీఠానికి వెళ్లే రోడ్డులో పూర్తిగా కర్ఫ్యూ విధించారా అన్నంత పరిస్థితి ప్రజలకు ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : సేవాస్ఫూర్తి అసోసియేషన్, థాన్ ఫౌండేషన్, మహత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రనగర్ కూడలి వద్ద బుధవారం మహిళలకు పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మహత్మాగాంధీ కేన్సర్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ సుభద్ర, డాక్టర్ భవాని నేతృత్వంలో 135 మందికి గర్భాశయ, రొమ్ము కేన్సర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో థాన్ ఫౌండేషన్ హెల్త్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, ఫెడరేషన్ కో ఆర్డినేటర్ రామ్‌కుమార్, సేవాస్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, సభ్యులు పాత్రుడు, ఆనంద్, కె.తాతారావు, నానాజీ, లక్ష్మణరావు, పద్మాజీ, ఆర్.అచ్యుతరావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి, జనసేన ఉమ్మడి తొలి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు పార్టీ శ్రేణులను కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నేతల సమావేశంలో మాట్లాడుతూ, పార్టీ సాధారణ సారథులతో కలిసి క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌ఛార్జిల సహకారంతో ఇంటింటికీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డిఎన్ రాజు, నాయకులు కె దామోదరరావు, కె లీలావతి పాల్గొన్నారు.

రాయితీపై చేపల వేట పరికరాలివ్వాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : సంప్రదాయ మత్స్యకారులకు 90 శాతం రాయితీపై చిన్న ఫైబర్ బోట్లు, వలలు, ఇంజన్లు, ఐస్ బాక్సులు, ఇతర వేట సామగ్రి అందజేయాలని ఎపి కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్‌కు విశాఖపట్నం అందజేసినట్లు ఎపి ఫిషర్ మెన్ కాంగ్రెస్ చైర్మన్ కదిరి జగన్నాథం తెలిపారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరారు. తీర ప్రాంతంలో పూర్తి హక్కులు, 45 ఏళ్ల పైబడిన వారికి పింఛను సదుపాయం కల్పించాలని కోరారు.

స్వీయ నమ్మకమే విజయానికి పునాది

ప్రజాశక్తి -ములగాడ : మన మీద మనకున్న నమ్మకమే విజయానికి పునాది అని హెచ్‌పిసిఎల్ హెచ్ఆర్ మేనేజర్ భరణి అన్నారు. బుధవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో సీనియర్ విద్యార్థినుల వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతూ, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషి ఉంటే విజయాలు సొంతం అవుతాయన్నారు. ఇంటి పని, ఉద్యోగాన్ని సమన్వయం చేసుకుంటూ, మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే దేశం అభివృద్ధిని సాధిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జయశీల పాల్గొన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో 'శ్రీకృష్ణ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆరిలోవ : తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్సులో ఆదర్శనగర్ శ్రీకృష్ణ గ్రామర్ స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరు జాతీయ రికార్డుల్లో లక్ష్యంగా సత్తా చాటి తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించారు. 50 మంది విద్యార్థులచే శతాధిక భగవద్గీత శ్లోకధారణ, శతాధిక హిందీ కవితల ధారణ, 75 మంది ఎల్‌కెజి, యుకెజి చిన్నారులతో 75 ఆంగ్ల అభినయ గేయాల ధారణ నిర్వహించారు. వీటితో పాటు వ్యక్తిగత రికార్డుల్లో భాగంగా ముద్దల కారుణ్యశ్రీ 150 ఆంగ్ల పర్యాయ పదాలను 4 నిమిషాలకు గాను 2.47 నిమిషాల్లో పూర్తి చేసింది. పూడి శ్యామచంద్రిక 100కు పైగా హిందీ అంకెలను 45 సెకన్లకు గాను కేవలం 43 సెకన్లలో అద్భుతంగా ధారణ చేసి ఆహూతులను ఆశ్చర్యపరిచింది. ఆరేళ్ల చిన్నారి బొద్దు గుణాశ్రిత భారతదేశ రాష్ట్రాలు, రాజధానుల పేర్లను 30 సెకన్లకు గాను 24 సెకన్లలోనే చెప్పి ఔరా అనిపించింది, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రత్యేక పరిశీలకులు డాక్టర్ వినకోట వెంకట బుచ్చిరాజు నిశితంగా పరిశీలించి జాతీయ స్థాయి రికార్డులుగా అర్హత సాధించారని ధ్రువీకరించి సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులను స్కూలు డైరెక్టర్ మునికృష్ణ, గిన్నిస్ బుక్ రికార్డు విజేత డాక్టర్ నారాయణ శివకర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జరజాపు రంగారావు, స్కూలు డైరెక్టర్లు విజయ భాస్కర్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్న శ్రీకృష్ణ విద్యార్థులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సిసి రోడ్డు శంకుస్థాపనలో కార్పొరేటర్ కొండబాబు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చినఉప్పాడలో రూ.22లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వార్డు పరిధిలోని శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు.

సీతమ్మధార: జివిఎంసి 42వవార్డు న్యూకాలనీ బజార్ లైన్, శివాలయం వెనుక వీధి, రామాలయం వెనుక ప్రాంతంలో రూ.98.77లక్షలతో సిసి రోడ్డు, డ్రైనేజ్ పనులకు స్థానిక కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. నాగమణి రామ్మూర్తి, గణేష్, మాధవ, సురేంద్రలాల్, స్వర్ణ, గౌరీ, లక్ష్మీ, బ్రహ్మాజీ, లోకేష్, శ్రీనివాసరెడ్డి, త్రిష్ణవేణి, నూకరాజు, సాజ్ హాన్, శ్రీవాణి, పద్మజా, పద్మసాయి, లోకేష్, భాను, వెంకటరావు, భగవతిరావు, రిజ్వాన్ ఖాన్, నాగరాజు, తులసి, ఆళ్ల గోపి, బాణాల తరుణ్, బైర వెంకట్, చలం, సీతారాం, కాయల రామారావు, పైడి రమణ తదితరులు పాల్గొన్నారు.

43వ వార్డులో...

43వ వార్డు 80 అడుగుల రోడ్డు బ్రహ్మం ఆలయం వద్ద రూ.41లక్షల వ్యయంతో సామాజిక భవనం నిర్మాణానికి జివిఎంసి ఫ్లోర్‌లీడర్, బాణాల శ్రీనివాసరావు, 43వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో కె.కె రాజు శంకుస్థాపన చేశారు కార్యక్రమంలో ఎఇఇ రవణమ్మ, బులుసు జగదీశ్, షరీఫ్, ప్రసాద్,



శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు, తదితరులు

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు విజయవంతం

ప్రజాశక్తి- వేపగుంట : మండలం లోని పాలవలస సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారులు ఎం.గంగు నాయుడు, షేక్ షహనాజ్ సాధ్య, విశాఖ కెజిహెచ్ వైద్యనిపుణులు పాల్గొని 545 మంది రోగులకు వైద్యపరీక్షలు చేశారు. ఆనందపురం పిహెచ్‌సి ఎంఎల్‌హెచ్‌పి లు నిర్వహించిన యోగా శిబిరానికి విశేష స్పందన వచ్చింది. వైద్యశిబిరాన్ని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఉమావతి సందర్శించారు. మెరుగైన వైద్యం అవసరమైన రోగులను గుర్తించి, విశాఖలోని ఆసుపత్రులకు తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగోతి అచ్చమ్మ, ఎంపిడిఒ అప్పలనాయుడు, సిహెచ్ఒ పి సాంబమూర్తి, హెచ్ఎస్ డి.పార్వతమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

452 మందికి ఆరోగ్య సురక్ష పరీక్షలు

భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు కృష్ణా కాలనీ సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 452 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 30 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. కంటి వెలుగులో భాగంగా 21 మందికి కళ్లద్దాలు అందించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

ప్రజాశక్తి -పద్మనాభం: భీమిలి నియోజకవర్గంతోపాటు పద్మనాభం మండలంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతోనే అభివృద్ధి జరిగిందని, దీనిపై చర్చకు తాము సిద్ధమని వైసిపి మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపిపి కె.రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, మండలంలోని పద్మనాభం, కృష్ణాపురం, బిఆర్.తాళ్లవలస వంటి గ్రామాల్లో తరాలుగా సాగులో ఉన్న భూములపై రైతులకు హక్కు కలిగేలా సమస్య పరిష్కరించారన్నారు. పద్మనాభం ఘాట్‌రోడ్డుకురూ.ఐదు కోట్లు మంజూరు, పాండ్రంగి వద్ద గోస్తనీ నదిపై వంతెన నిర్మాణానికి రూ.16కోట్లు మంజూరు, రూ.15కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, 22 గ్రామపంచాయతీల్లో 16 సచివాలయాలు, వెల్నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం, ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాలరన్నారు. వైసిపి నేతలు అప్పలరాజు,బంగారప్పుడు, సన్యాసినాయుడు, బి అప్పలనాయుడు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - ఆరిలోవ : కంటి ఆరోగ్యంపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ అల్లూరి హిమబిందు సూచించారు. పరీక్షల సమయంలో కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఎక్కువగా డిజిటల్ స్క్రీన్ చూస్తూ అభ్యసించడం, ఒత్తిడితో ఎక్కువ సమయం పుస్తకాలు చదవటం వల్ల కళ్ళు పొడిబారడం, తలనొప్పి రావటం, దృష్టిలో అస్పష్టత, పార్శ్వ నొప్పి(మైగ్రాన్) లక్షణాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంకా దృష్టి లోపమున్న పిల్లలైతే మరింతశ్రమపడాల్సి వస్తుందన్నారు.



డాక్టర్ హిమబిందు అల్లూరి

ఇటువంటి లక్షణాలుంటే వెంటనే కంటి వైద్యులను సంప్రదించి నేత్రపరీక్షలు చేయించు కోవాలని, కంటి అద్దాల పవర్‌లో మార్పులు చేయించడం అవసరమన్నారు. చదివేటప్పుడు ప్రతి 20 నిమిషాలకు 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో వాటిని చూడటం ద్వారా కంటి కండరాలు సడలింపునకు సహకరిస్తుం దన్నారు. విద్యార్థులు డిజిటల్ ఉపకరణాల వినియోగాన్ని పరిమితం చేయాలన్నారు. ఎసి, కూలర్లు, ఫ్యాన్లు ముందు నేరుగా కూర్చుంటే కళ్లు పొడిబారే అవకాశమున్నందున తగు జాగ్రతలు తీసుకోవాలని, గాలి వెలుతురు ఉండే గదులను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.

కళింగ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి -మాధవధార : కళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన దుంపల లక్ష్మణరావును రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షులు పప్పల రామ్మోహనరావు బుధవారం మాధవధారలోని సంఘ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్స్ పైడి శ్రీనివాసరావు, సనపల రవీంద్ర భరత్, విశాఖపట్నం కారవేల ఎడ్యుకేషన్ కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పేడాడ నర్సింగరావు, పప్పల శ్రీహరి, పప్పల రామచంద్రరావు, పొన్నాడ అప్పారావు, సింగూరు విశ్వనాథం, సనపల నరసింహస్వామి, మల్లేష్ పాల్గొన్నారు.



లక్ష్మణరావును సన్మానిస్తున్న రామ్మోహనరావు

యూట్యూబర్ రేఖా భోజ్‌కు ప్రశంసలు

ప్రజాశక్తి- సీతమ్మధార : లక్షమంది సబ్‌స్క్రైబర్స్‌తో యూట్యూబ్ ఛానల్‌లో సిల్వర్ బటన్ జ్ఞాపికను దక్కించుకున్న విశాఖకు చెందిన హీరోయిన్ రేఖాభోజ్‌ను పలువురు ప్రశంసించారు. బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వైసిపి నేత దాడి సత్యనారాయణ యూట్యూబ్ పంపిన జ్ఞాపిక కవర్‌ను ఓపెన్ చేసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశాఖ అమ్మాయికి ఈ గౌరవం దక్కడం సంతోషకరమన్నారు. రేఖాభోజ్ బిగ్‌బాస్‌లో సత్తా చాటారన్నారు. హీరోయిన్ రేఖా భోజ్ మాట్లాడుతూ, యాక్టర్ అయ్యే క్రమంలో వద్దనుకున్న యూట్యూబ్ ఛానల్‌ను దర్శకుడు రాకేష్ రెడ్డి సలహాతో ప్రారంభించి, పాపులర్ కావడం ఆనందంగా ఉందన్నారు. దర్శకుడు రాకేష్‌రెడ్డి, రంగసాయి అధినేత బాదంగీరు సాయి, కామెడీ క్లబ్ అధ్యక్షుడు త్రినాధ్, జూనియర్ నాగార్జున, శివశ్రీ, రమేష్‌బాబు తదితరులు రేఖాభోజ్‌ను అభినందించారు.

గంగవరం సిడబ్ల్యుసి ఆధ్వర్యాన క్రీడా పోటీలు

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం ఉక్కు సిడబ్ల్యుసి క్రీడాపోటీలను బుధవారం ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కెఎస్ఎన్ రావు ప్రారంభించారు. క్రికెట్, విండ్‌బాల్,వాలీబాల్, ఇతర క్రీడాంశాలల్లో పోటీలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గంగవరం సిడబ్ల్యుసిని అభినందించారు. ప్రారంభ వేడుకలో ఉక్కు గుర్తింపు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మసేన్‌రావు, చీకటి శ్రీనివాస్, పల్లెటి పోలయ్య, ఉక్కు సిడబ్ల్యుసి కార్యదర్శి పేర్ల సత్యారావు, కోశాధికారి కె. పోతన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 14మంది ఎంపిక

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 14మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన కాడ్‌నెస్ట్ టెక్నాలజీస్ ప్రయివేటు లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొని, ఫైనలియర్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు.క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులను కాలేజీ చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీధర్‌పట్నాయక్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఆడారి తులసినాయుడు, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ 70 శాతం పూర్తి

ప్రజాశక్తి -కోటవురట్ల: జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీ ఇళ్ళ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ 70శాతం పూర్తయినట్లు జిల్లా రిజిస్ట్రార్ జానకి దేవి తెలిపారు. బుధవారం ఆమె రిజిస్టర్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 86వేల ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేయవలసి ఉండగా ఇంత వరకు 60వేల రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పలు కార్యాలయాల నుంచి అక్రమ రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయంటూ స్పందనలో వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరి స్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు అక్రమ రిజిస్ట్రేషన్ జరిగితే తహసిల్దారు రద్దు చేసే అధికారం ఉన్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 11 రిజిస్టర్ కార్యాలయాలు ఉండగా 5 మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని, 6 అద్దె భవనాల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు. కొన్ని కార్యాలయంలో సర్వరు సక్రమంగా పనిచేయక రిజిస్ట్రేషన్ జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ నరసింహమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్

ఎన్నికల్లో టిడిపి ఓటమి ఖాయం

ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: వచ్చే ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీని తరిమికొట్టడం ఖాయమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, నారా లోకేష్ నర్సీపట్నంలో నిర్వహించిన శంఖారావం సభకు స్పందన లేదన్నారు. కనీసం 2వేల మంది కూడా రాలేదన్నారు. ఇదే నర్సీపట్నంలో వైసీపీ సాధికార సామాజిక యాత్ర బహిరంగ సభకు 40వేల మంది వచ్చారన్నారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని, అప్పటి వరకు నిరుద్యోగ భృతి కింద 3వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను మోసం చేశారన్నారు. మళ్లీ 2024 ఎన్నికల కోసం నిరుద్యోగులను మోసం చేయడానికి చూస్తున్నారన్నారు.



30మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని కైలాసపట్నం గ్రామం వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా 30మద్యం బాటిళ్లను అప్పారావు అనే వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకన్నామని స్థానిక ఎస్సై రమణయ్య తెలిపారు. నిందితుడిని రిమాండ్కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.



పోస్టు కార్డులను చూపుతున్న ఉపాధ్యాయులు

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఓట్ ఫర్ ఒపిఎస్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: సిపిఎస్‌ని రద్దు చేసి, ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని పెదబొడ్డేపల్లి హైస్కూల్‌లో పోస్ట్ కార్డులను, ఓటు ఫర్ ఓపిఎస్ పోస్టర్లను యుటిఎఫ్ ఆధ్వర్యంలోఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల కన్వీనర్ అనిమిరెడ్డి సాంబమూర్తి మాట్లాడుతూ, ఈ విషయాన్ని అన్ని పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాలని ఆయా పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు ఉత్తరాలు రాసామని, సీపీఎస్ రద్దు చేసే వారికి ఉద్యోగ ఉపాధ్యాయులు ఓటు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ, నర్సీపట్నం, నాతవరం మండలాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించే వరకూ.. భూముల జోలికి రావద్దు

గ్రామ సభలో స్పష్టం చేసిన నిర్వాసితులు, నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి: 2013 భూ సేకరణ చట్ట పకారం పరిహారం, ప్యాకేజీ పూర్తిస్థాయిలో చెల్లించే వరకు భూముల జోలికి రావద్దని నిర్వాసితులు, నాయకులు స్పష్టం చేశారు. మండలంలోని అమలాపురం పంచాయతీ మూలపర్ర గ్రామంలో బుధవారం వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి పెండింగ్ పేమెంట్లు, సమస్యలను తెలుసుకునేందుకు రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీ పరిధిలోని 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి 15 లక్షల రూపాయలు ప్యాకేజీ చెల్లించాలని, ఇల్లులు కోల్పోతున్న కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి 25 లక్షల రూపాయలు ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు.జిరాయితీ భూములతో సమానంగా డిఫారం, సాగు భూములకు 18 లక్షల రూపాయలు నష్టపరహారం చెల్లించాలన్నారు. జీవో 268 ప్రకారం చెట్లకు నష్ట పరిహారం పెంచి చెల్లించి, డిఫారం, సాగు భూములలో ఉన్న చెట్లకు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇల్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికి 10 సెంట్లు ఇంటి స్థలం కోరిన చోట ఇవ్వాలని, మెరుగైన పునరావాసం కల్పించాలన్నారు. ఆర్ కార్డులు ఇవ్వాలని, పర్యావరణం దెబ్బతీసే, ప్రజల ఆరోగ్యాలకు నష్టం కలిగించే బల్క్ డ్రగ్స్, ఫార్మారసాయన కంపెనీలు నెలకొల్ప వద్దని తెలిపారు. బోరుబావులకు, నేల బావులకు, రైతుల పశువుల పాకులకు పూర్తిస్థాయిలో నష్టపరహారం చెల్లించాలన్నారు. పరిహారం, ప్యాకేజీ పూర్తిస్థాయిలో చెల్లించే వరకు భూముల జోలికి రావద్దని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, అమలాపురం గ్రామ సర్పంచ్ పెదపూడి శంకర్రావు, ఉపసర్పంచ్ గంటా నర్సింగరావు, మాజీ సర్పంచ్ సూరకాసుల రామలక్ష్మి, వైసిపి నాయకులు సూరకాసుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మండలంలోని పీపీ అగ్రహారం, గున్నెంపూడి, పెదమదిన, చింతపాక, పెదపూడి సచివాలయాలలో వాలంటీర్లను బుధవారం ఘనంగా సత్కరించారు. సేవా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డి నాగేశ్వరిదేవి, జెడ్పిటిసి దొండా రాంబాబు, మండల వైసీపీ అధ్యక్షుడు జోగా కొండబాబు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని జోగంపేట సచివాలయంలో వాలంటీర్లకు ఎంపీపీ గజ్జలపు మణి కుమారి, ఎంపిడిఒ రత్నకుమదరి, వైస్ ఎంపిపి జక్కు నాగమణిలు పురస్కారాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి అర్హులైన లబ్ధిదారులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జువ్వల లక్ష్మి, సాలికమల్లవరం సర్పంచ్ పెద్దిరెడ్డి నూకరత్నం, వైసిపి అధికార ప్రతినిధి జక్కు అప్పలస్వామినాయుడు, మండల మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జువ్వల దేముడు, పెదిరెడ్ల అప్పలనాయుడు, ఈఓపిఆర్‌డి రమణి, పంచాయతీ సెక్రటరీ రఘు పాల్గొన్నారు.



బుచ్చయ్యపేటలో సత్కారం పొందినం వాలంటీర్లు


రోలుగుంట: మండలంలోని కొవ్వూరు గ్రామ సచివాలయంలో బుధవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ, రాజారావు దంపతులు వాలంటీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె.రామలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్‌కు వినతుల వెల్లువ

నర్సీపట్నం టౌన్: సంక్షేమ పథకాలకు అంబేద్కర్ పేరు పెట్టాలని, దళితుల సంక్షేమ పథకాలను కొనసాగించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు దళిత సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళితుల సాగులోఉన్న భూములకు రక్షణ కల్పించాలన్నారు. దళితులకు ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల స్థలాలు 3 సెంట్ల స్థలంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అన్ని సౌకర్యాలతో నిర్మించాలన్నారు. శిధిలావస్థలో ఉన్న వసతి గృహాలకు కొత్త భవనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ దళిత వాడలో అంబేద్కర్ సామాజిక భవనాలు నిర్మాణానికి నిధులు కేటాయిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి లోవరాజు, సీనియర్ దళిత నాయకులు నేతల నాగేశ్వరరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గాతాడ సహదేవుడు, ఎమ్మార్పీఎస్ డివిజన్ నాయకులు కోడి శ్రీనివాసరావు, డిపిఐఎస్ జిల్లా అధ్యక్షులు కోండ్రు మరిడయ్య పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: సిపిఎస్, 117 జీవోల రద్దు చేయాలని, ఈ విషయమై రాబోవు ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ కోటవురట్ల మండలం యూటీఎఫ్ అధ్యక్షులు జవ్వాది నరసింగరావు ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కోటవురట్ల మండల ప్రధాన కార్యదర్శి జంగా వరప్రసాద్, గౌరవ అధ్యక్షులు అడిగర్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు ఎం.చిట్టియ్య పాల్గొన్నారు.

రావికమతం: విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారంపై తెలుగుదేశం, జనసేన పార్టీ మేనిఫెస్టోలో పెట్టాలని రావికమతం మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గెంజి శ్రీనివాసరావు లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లారు. వికలాంగుల పెన్షన్ 6000లకు పెంపు, ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు, త్రీ వీలర్ స్కూటీలు మంజూరు, 35 కేజీల అంత్యోదయ రైస్ కార్డులు మంజూరు, ఐదు లక్షల రూపాయల రుణ సదు పాయం తదితర సమస్యలపై వినతి పత్రాన్ని ఘాట్ రోడ్డు శంఖారావంలో లోకేష్‌ను అందించామన్నారు. దానిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొంప ఎంపీటీసీ గంజి సూర్యనారాయణ, సత్తిబాబు పాల్గొన్నారు.



లోకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న రావికమతం మండల నాయకులు

ఊరూరా ప్రజా పోరుయాత్ర 2

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని కింతలి, వొమ్మలి గ్రామాల్లో బిజెపి శ్రేణులు ప్రభుత్వం చేస్తున్న పథకాలను తెలియజేస్తూ ప్రజా పోరుయాత్ర2 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు అప్పలకొండ కుమార్, నియోజకవర్గ ఇన్చార్జ్ మేడపరెడ్డి శ్రీనివాస్, ప్రజా పోరుయాత్ర నియోజకవర్గ ఇన్చార్జ్ మండల సతీష్, కో ఇన్ఛార్జ్ శివాజీ రాజ్, మండలాల అధ్యక్షుడు ఉండూరు రాజు, పరవాడ మురళి, కాళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మాకవరపాలెం: గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకులు, ఆర్థిక అక్షరాస్యతపై సంపూర్ణ అవగాహన కల్పించడం కోసమే ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తామరం శాఖ మేనేజర్ రాణి తెలిపారు. బుధవారం తామరంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. డిజిటల్ పేమెంట్, ఏటీఎం వాడకం, బ్యాంకింగ్ యాప్, పొదుపు ఉపయోగాలు, డిపాజిట్, పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మణికుమార్, అనిల్ కుమార్, వరలక్ష్మి పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న మేనేజర్

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త రూపావతి సూచించారు. నక్కపల్లి రెసిడెన్షియల్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మరికొన్ని రోజుల్లో పరీక్షలు జరగను న్నాయని, విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. పరీక్షల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఒత్తిడి, భయం లేకుండా చూడాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.



మొక్కలు నాటుతున్న రూపావతి

'ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి'

ప్రజాశక్తి -నక్కపల్లి: మత్స్యకారులకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి క్షమాపణ చెప్పాలని ఏపీ మత్స్యకార జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరయ్య డిమాండ్ చేశారు. ద్వారంపూడి మత్స్యకార జాతిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.మత్స్యకార జాతికి ద్వారంపూడి బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు .

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి -వడ్డాది: అగ్ని ప్రమాదాల నుంచి తప్పించుకునే విధానాలను విద్యార్థి దశ నుంచి నేర్చు కోవాలని ఫైర్ స్టేషన్ ఎస్ఐ మల్లునాయుడు తెలిపారు బుచ్చయ్యపేట మండలం పడ్డాది స్థానిక అక్షర స్కూల్లో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఎండాకాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. స్కూల్స్, కాలేజీలు, .హెూటల్స్, థియేటర్స్‌లో అత్యవసర సమయంలో అగ్ని ప్రమాదాల నుండి ఎలా తప్పించుకోవాలో తెలియజేశారు. తుఫాన్ వంటి విపత్తుల సమయాల్లో కూడా ఎలా బయటపడాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ తగరంపూడి వరప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.



అవగాహన కల్పిసున్న ఎస్ఐ

ఎక్కడమ్మా నువ్వు లేనిది.. ఏమిటీ నువ్వు చేయలేనిది...

- నేటి నుంచి విశాఖలో ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలు
- 'ప్రజాశక్తి'తో ఉద్యమ అనుభవాలను పంచుకున్న మహిళా నేతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మానవ జాతి మనుగడకు ఆధారమే మహిళ. అనేక రూపాల్లో ఈ సమాజంలో సమర్థవంతమైన పాత్రలను పోషించడంలో ఎక్కడమ్మా నువ్వు లేనిది... ఏమిటి సాధించలేనిది? అనేలా ఆకాశం అంత ఎత్తుకు ఎదిగిన సంగతి తెలిసిందే. వారి ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలకు భంగం కలుగుతున్న ప్రతి సందర్భంలోనూ, సమాన హక్కుల సాధన కోసం పోరాడుతూనే ఉన్నారు. ఐద్వా సంఘం మహిళలకు ఉద్యమస్ఫూర్తినివ్వడంలో దశాబ్దాల తరబడి కృషి సాగిస్తూనే ఉంది. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా విశాఖ జిల్లాలో భూ పోరాటాలు, నిత్యావసర సరకుల ధరలపైనా, ఇళ్ల స్థలాల సమస్యలపైనా, మహిళలపై పెరుగుతున్న హింసాత్మక ఘటనలపైనా ఎలుగెత్తి పోరాడే నేతలు తమ అనుభవాలను ప్రజాశక్తితో పంచుకున్నారు.

శ్రామిక మహిళలను అనేక పోరాటాలు కదిలించాయి


పద్మజ, పూర్వ నాయకులు, శ్రామిక మహిళా సంఘం

1982 నుంచి మహిళా సంఘంతో పరిచయం ఉంది. ఎస్.పుణ్యవతి విశాఖ జిల్లా నాయకురాలుగా ఉంటూ అనేక కార్యక్రమాలకు దిశానిర్దేశం చేయడంతో చురుకుగా పాల్గొనే వాళ్లం. డి.శారద, సూర్యమణి, ఎస్.మణి, నళిని, నిర్మల, మల్లేశ్వరి అంతా ఒక కుటుంబ సభ్యులుగా సంఘంలో కలిసి పనిచేశాం. ప్రభుత్వ రంగ సంస్థలు ముఖ్యంగా ఎల్ఐసి, జిఎస్ఐ, ఎంఎంటిసి, బిఎస్ఎన్ఎల్ వంటి సంస్థల్లో పనిచేసే శ్రామిక మహిళలను కలుపుకోవడం ప్రభుత్వ విధానాలపైనా, మహిళలు ఎదుర్కొనే సమస్యలపైనా చర్చలు, సమావేశాల ద్వారా అనేక అంశాలపై మాట్లాడే వారిని చైతన్యం చేయడం జరిగింది. 1983లో మొట్టమొదటిసారిగా నగరంలోని సుబ్బలక్ష్మి నగర్లోని పార్వతీ కళ్యాణ మండపంలో సభ జరిగింది. శ్రామిక మహిళలతో సమన్వయ కమిటీ ఏర్పాటుకు నేను సభల్లోనే కృషిచేశాను. పోస్టల్, ఎల్ఐసి, బిలెక్ట్రిక్ వంటి సంస్థల్లోని మహిళలను ఒక వేదికపైకి తీసుకొచ్చాం. సిఐటియు ఎల్ఐసి, ఎఐఐఇఎ సంఘాలు నిర్వహించే అనేక ఉద్యమాల్లోనూ అందరినీ భాగస్వామ్యం చేశాం. ప్రజా ఉద్యమాల్లోనూ శ్రామిక మహిళలను ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వామ్యం చేసే పరిస్థితి ఆనాటి నుంచి జరిగింది. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అనేక సదస్సులు విశాఖ నుంచి హాజరవ్వడంతో ఉద్యమ స్ఫూర్తి విస్తరణకు ఎంతగానో దోహదపడింది. విశాఖలో అప్పట్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నోడల్ బస్ సర్వీసులపై శ్రామిక మహిళలను ఐక్యం చేసి ఉద్యమించాం. బస్టాండుకు వచ్చి మాత్రమే బస్సులు ఎక్కాలనే రూల్ను మహిళా సంఘంగా వ్యతిరేకించాం. ప్రభుత్వం దిగొచ్చి ఆ ఉత్తర్వును వెనక్కి తీసుకుంది.

పట్టణాలు, గ్రామాలు, కొండవాలు ప్రాంతాల్లో పనిచేశాం

- ఆర్.భాగ్యలక్ష్మి, ఐద్వా పూర్వ విశాఖ జిల్లా కార్యదర్శి



ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అనకాపల్లి, అరకు, పాడేరు, విశాఖ ఇలా అన్నిచోట్లా మహిళా సమస్యలపైనా, హక్కుల కోసం ఐద్వా అనేక రూపాల్లో పనిచేసింది. విశాఖలో ప్రభుత్వ రంగ సంస్థలు ఉండాలని, కార్మికులు, ఉద్యోగులకు భద్రత ఉండాలని పోరాడాం. బిహెచ్పివి, స్టీల్ప్లాంట్, నేవల్ డాక్యార్డులో పలు సమస్యలపై వందల సంఖ్యలో వర్కింగ్ ఉమెన్స్ (శ్రామిక మహిళలు)తో ఐద్వా కార్యక్రమాలు నిర్వహించింది. విశాఖపట్నంలోని కొండవాలు ప్రాంతాల్లో నివాసముండే ప్రజల సమస్యలు, మురికి వాడల్లో మహిళలపై జరుగుతున్న హింసపైనా పోరాటాలు చేశాం. సమాజంలో పెరిగిపోతున్న హింసపైనా, మహిళలపై దాడులు, వారు ఇబ్బందులు గురౌతున్న తీరును ఎప్పటికప్పుడు పోలీసు అధికారులు, జిల్లా యంత్రాంగం, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకు రావడంలో 1990 నుంచి ఐద్వా గణనీయ కృషి కొనసాగిస్తోంది. నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్న క్రమంలో గృహిణులపై పడే ఆర్థిక భారాలపై అనేక పోరాటాలు సాగించాం.

పేదలకు 60 గజాల స్థలం ఇవ్వాలన్న డిమాండ్పై వేలాదిమంది మహిళలతో 45 రోజుల పాటు విశాఖలో జరిగిన భూ పోరాటంలో 13 రోజులు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. అప్పట్లో మహిళా నాయకత్వం అంతా జైలులోనే ఉంది.

విద్యార్థి సంఘం నుంచి శ్రామిక మహిళా ఉద్యమంలోకి...

- బి పద్మ, ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు



అది 1985వ సంవత్సరం. టెన్త్ క్లాస్లోనే స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)తో పరిచయం. 1989 వరకు ఎస్ఎఫ్ఐలోనే కార్యకర్తగా పనిచేశాను. తర్వాత శ్రామిక మహిళా ఉద్యమంలో 2001 వరకూ పనిచేశాను. అప్పటికే విశాఖపట్నంలో బలమైన మహిళా ఉద్యమం, చురుకైన కార్యకర్తలు, చొరవగల నాయకత్వం ఉంది. వీరి నుంచి స్ఫూర్తిని పొందాను. విశాఖ ప్రభుత్వ రంగ సంస్థలు ఉండడంతో ఆయా సంస్థల్లో కార్మికోద్యమం కూడా గణనీయమైన స్థితిలో ఉండడంతో సిఐటియు కుటుంబాల్లో ఉండే మహిళలు, వారి కుటుంబాలతో కలిసి పనిచేసిన అనుభవం కూడా ఏర్పడింది. ఆయా సంస్థల్లో ఉండే సిఐటియు కుటుంబ సభ్యులతో భాగస్వామ్యం అయి పనిచేయడం ద్వారానే మహిళలను ఉద్యమాల్లోకి తీసుకొచ్చి వారి సమాజంలో మహిళా సమస్యలపై పోరాటాలు విజయం సాధిస్తాయని గుర్తించాం. విద్యార్థి దశ నుంచి ఉద్యమాల్లో ఉన్నందున 1985 నుంచి జరిగిన అన్ని ముఖ్యమైన కార్యక్రమాల్లోనూ పాల్గొనడం జరిగింది. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యమాల్లోనూ భాగస్వామ్యం అయ్యాను. భూ పోరాటాలు, విద్యుత్ పోరాటాల్లో అరెస్టు అయి జైలుకు వెళ్లాను. ఐఎఎస్ తన భార్యను హింసించిన కేసులో కేసులు పెట్టడంలో ప్రధాన పాత్రపోషించాను. 2001 నుంచి పలు బాధ్యతల్లో మహిళా ఉద్యమాల్లోనూ, ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం అయ్యాను. 2021 నుంచి విశాఖ జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్నాను.

ఇళ్ల స్థలాలపై మహిళలు బాగా కదిలేవారు

- ఎం సుజాత, ఐద్వా పూర్వ నాయకులు



1980వ దశకంలోనే మహిళా సంఘం ఐద్వాతో పరిచయం. మల్కాపురం ప్రాంతంలో మహిళా సంఘం కార్యకలాపాలు చేపట్టాం. అప్పట్లో సిపిఎం నాయకులు, మహిళా నాయకుల పెళ్లి సందర్భాల్లో మంచి స్నేహ సంబంధాలు ప్రజలతో వచ్చేవి. ఆ సందర్భంగా అనేక మంది మహిళలను పార్టీ జరిపే ఆదర్శ వివాహాలు ఆకర్షించేవి. ఈ సందర్భంలో మహిళా సంఘం బలోపేతం కూడా అయింది. శేషారత్నం నేను ఇంకొంతమంది కలిసి పనిచేశాం. ఐద్వా విశాఖ జిల్లా మొదటి మహాసభలో జోన్ కమిటీకి నేను కార్యదర్శి, అనూరాధ అధ్యక్షురాలుగా, శేషారత్నం కార్యదర్శిగా అప్పట్లో ఉన్నారు. విశాఖలో పేద, సామాన్య మహిళలు ఇళ్ల స్థలాల సమస్యలపైనా, నిత్యావసర సరకుల ధరలను ప్రభుత్వం పెంచినప్పుడు జరిగిన ఐద్వా పోరాటాల్లో మహిళలంతా సంఘటితంగా కదిలేవారు. మధ్యతరగతి మహిళలు వరకట్న వేధింపులుపైనా, ఇతర పట్టణ మౌలిక సదుపాయాలపై పిలుపునిచ్చినప్పుడు పోరాటాల్లోకి కలిసి వచ్చేవారు. గతంలో ఇంట్లో భర్త, పిల్లలు అందరూ మహిళా సంఘ కార్యకలాపాలకు వెళ్లేటప్పుడు అడ్డుచెప్పేవారు కాదు. ఇంటి సహకారం గెలిచి మహిళా సమస్యలపై పోరాడి అనేక విజయాలు సాధించడం జరిగింది.

నేరాలు ఘోరాలు

మూడేళ్ల చిన్నారి కిడ్నాప్కు యత్నం

- పట్టుబడిన వ్యక్తికి స్థానికుల దేహశుద్ధి

ప్రజాశక్తి- సీతమ్మధార : మూడేళ్ళ చిన్నారిని కిడ్నాప్ చేయబోయి స్థానికులకు చిక్కిన ఓ వ్యక్తి స్థానికుల చేతిలో చావు దెబ్బలు తిన్నాడు .4వ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి. అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో బుధవారం అనుమానా స్పదంగా సంచరిస్తున్న వ్యక్తి, నందగిరినగర్లో ఒక ఇంట్లో ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేయబోయాడు. స్థానికులు అప్రమత్తమై అ వ్యకిని పట్టుకొని స్తంబానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం 4వ పట్టణ పోలీసులకు అప్పగించారు.బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగాఆ వ్యకి మానసిక స్థితిపై ఆరా తీస్తున్నామని పోలీసులు తెలిపారు .గత రెండురోజులుగా అదే ప్రాంతంలో ఆ వ్యక్తి తిరుగుతున్నాడని పోలీసులు తెలిపారు.

ఐదుగురు కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామ శివారులోని బహిరంగ ప్రదేశంలో కోడి పందెం శిబిరంపై మంగళవారం ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుండి ఒక కోడిపుంజును, రూ.10,220 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డి. ఈశ్వరరావు తెలిపారు. అలాగే నీలకంఠాపురం గ్రామంలో ముందస్తు సమాచారం మేరకు నాటుసారా అమ్ముతున్న యన్నంశెట్టి చెల్లం నాయుడును అరెస్టు చేశారు. ఆయన వద్ద ఉన్న 90 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆక్రమణపై ఫిర్యాదు చేశారని దాడి

ప్రజాశక్తి -ఆనందపురం : రహదారిని అక్రమించి, ఇంటి నిర్మాణం చేపట్టడం వల్ల రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తహశీల్దార్కు ఫిర్యాదు చేశామని తమపై దాడికి పాల్పడి, దుర్భాషలాడారని గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన దొంతల రామారావు ఆరోపించారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ప్రభుత్వమిచ్చిన ఇంటిస్థలం కంటే అదనంగా రోడ్డును ఆక్రమించి, పెద్ద సన్యాసప్పుడు అనే వ్యక్తి నిర్మాణం చేపట్టడంపై ఫిర్యాదు చేసినందుకు ఇంటి యజమాని భార్య పెద్ద లక్ష్మి, ఇల్లాపు రమణ, లక్ష్మి. తాడివాడ గౌరి మరికొందరు తన ఇంటిపైకి వచ్చి దుర్భాషలాడుతూ గొడవ చేశారని పిర్యాదులో పేర్కొన్నారు. మళ్ళీ వచ్చి దాడి చేసే అవకాశం ఉన్నందున తమకు రక్షణ కల్పించాలని కోరారు.

లంకవానిపాలెంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని లంకవానిపాలెం గ్రామంలో గిరి టేకు, మామిడి, జీడి మామిడి, అక్కేసియా తోటలలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక అధికారులకు, సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను ఆర్పి వేశారు. అప్పటికే సుమారు 17 మంది రైతులకు సంబంధించిన 9.77 ఎకరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానిక జెడ్పీటీసీ అనురాధ ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని, పరిసరాలను పరిశీలించారు. సంబంధిత రైతులకు అండగా ఉంటామని తెలిపి అధికారులతో సమీక్షించారు. ప్రమాదవ శాత్తు మంటలు అంటుకోవడం పట్ల ఆమె విచారం వ్యక్తంచేశారు. ఘటనపై సమాచారం అందుకున్న ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వెంటనే స్పందించి ఉన్నతస్థాయి అధికారులతో ఫోన్లో సంభాషించి ప్రమాద తీవ్రతను అదుపు చేయాలని సూచన చేశారు.

ఫోర్జరీ ఇంటి పట్టాల స్కామ్ దర్యాప్తుపై వెనకడుగు / ఆర్టిఐ యాక్టివిస్ట్ రెడ్డి వెంకటరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఫోర్జరీ ఇంటి పట్టాల స్కామ్పై దర్యాప్తునకు జివిఎంసి అధికారులు వెనకడుగు వేస్తున్నారని ఆర్టిఐ యాక్టివిస్ట్ రెడ్డి వెంకటరావు అన్నారు. విజెఎఫ్లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశలో ఆయన మాట్లాడుతూ, జివిఎంసి జోన్ -5 రెవిన్యూ విభాగంలో 132 ఇళ్ల పట్టాల ఫోర్జరీకి పాల్పడినట్లు ఆర్టిఐ ద్వారా సేకరించిన సమాచారంతో వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేసిన ఆక్రమణదారులకు కొన్ని రోజులలోనే నకిలీ ఇంటి పట్టాలతో ఇంటి పన్నుల పేరు మార్పు చేసి, జోన్- 5లోని కొందరు రెవిన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు.

2019 ఏప్రిల్ నుంచి 2021 జూన్ వరకు 423 నకిలీ ఇంటి పట్టాలతో మ్యుటేషన్లు డాక్యుమెంట్లు లేకుండా జరిపారని, ఒక్కొక పుస్తకానికి రూ.30 వేల నుంచి రూ.50 వేలు చొప్పున చేతులు మారినట్టు ఆరోపించారు. వీటిపై అప్పటి జెడ్సి మల్లయ్య నాయుడు, డిసిఆర్ నల్లనయ్య, ఎడిసి సన్యాసి రావుకు ఫిర్యాదులు చేసినప్పటికీ, సర్వసభ్య సమావేశంలో చర్చలు జరిపినా చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై ఓ న్యాయవాది ఆర్టిఐ యాక్ట్ ద్వారా సమా చారం కోరినా, రెవెన్యూ అధికారులు ఇవ్వలేదని, కమిషన్ ముందు హాజరు కావాలని సమాచార కమిషనర్ ఆదేశించినా హాజరు కాలేదన్నారు. గైర్హాజరైన సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని జివిఎంసి కమిషనర్ను సమాచార కమిషన్ ఆదేశించినా చర్యలు తీసుకోలేదన్నారు.నకిలీ ఇళ్ల పట్టాలను సీతమ్మధార లోని తహశీల్దార్ కార్యాలయానికి పంపగా అవి నకిలీవని నిర్ధారించారన్నారు. నకిలీ పట్టాల స్కాంలో ప్రధాన పాత్ర పోషించిన జెడ్సి పి.సింహాచలం, రెవెన్యూ అధికారులు సిహెచ్ రామనారాయణ, మురళీ ధర్, ఆర్వి అప్పారావు, ఎస్కె.సుబాన్, శివకుమార్, ఆయా వార్డుల అడ్మిన్ కార్యదర్శులపై విజిలెన్స్, సైబర్క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలగ కులస్తులను బిసి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంఘం సభ్యుడు పల్లంట్ల వెంకటరమణ డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్క్లబ్లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 1960 వరకు తెలగ కులం బీసీ జాబితాలో ఉండేదని, ఆ తర్వాత దానిని తొలగించారన్నారు. దీనివల్ల ఉత్తరాంధ్రలోని సుమారు పది లక్షలకు పైగా ఉన్న తెలగ కులస్తులు నష్టపోతున్నారని తెలిపారు. తమ కులాన్ని బిసి జాబితాలో చేర్చాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుంచి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వరకు సుమారు 664 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి ఈ నెల 20న ముగించినట్లు తెలిపారు. తెలగ కులాన్ని బిసి జాబితాలో చేరుస్తామని హామీ ఇస్తూ అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనాలని డిమాండ్ చేశారు. ఆ హామీ ఇచ్చిన పార్టీకి తాము మద్దతు ఇస్తామన్నారు. మీడియా సమావేశంలో మంగం రాజా, అప్పన్న, స్వరబత్తుల అప్పారావు, ఎస్ఎన్ మూర్తి, పోడు మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలోని ఇంజినీరింగ్ కళాశాలల ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కర్ణాటక రాష్ట్రంలోని 150కు పైగా ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలలోను, దేశవ్యాప్తంగా 50కి పైగా డీమ్డ్ యూనివర్సిటీలలో ప్రవేశాల కోసం కమేడ్ కె, యూని గేజ్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కమేడ్ కె సిఇఒ పి.మురళీధర్ తెలిపారు.బీచ్ రోడ్లోని నోవాటెల్ హోటల్లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కర్ణాటకలో ఇంజినీరింగ్ విద్య అభ్యసించాలనుకునే వారు ఈ పరీక్షకు హాజరుకావాలని కోరారు. తమ సంస్థ ద్వారా నిర్వహించే ఈ పరీక్ష ద్వారా 30 శాతం సీట్లు అనగా రాష్ట్రవ్యాప్తంగా 22 వేల సీట్లను భర్తీ చేయనున్నామని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు ఏప్రిల్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 12వ తేదీన పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న రాజేశ్వరరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన తెలుగు మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్కూల్ పిల్లలకు తెలుగు భాషపై పోటీలు నిర్వహించారు. తెలుగు గేయాలాపన, తెలుగు అక్షరాలతో చిత్రలేఖనం, పొడుపు కథలు, పద్య పఠనం, తెలుగు భాష గొప్పతనం తెలియజేస్తూ పాటలు, తెలుగులో అనర్గళ ప్రసంగం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ స్కూళ్లకు చెందిన 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జెపి.శర్మ, నాగలక్ష్మి, లక్ష్మీనాయుడు, సురేంద్రకర్, చిన సూర్యనారాయణ, మురళి, పి.శ్రీనివాస్, డి.మనోహర్, కె.శ్రీనివాస్ వ్యవహరించారు. పోటీల అనంతరం విజేతలకు జ్ఞాపికలు, పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలను న్యాయ నిర్ణేతలు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలను అల్లూరి విజ్ఞాన కేంద్రం ఇన్చార్జి వివిఎస్ పద్మనాభ రాజు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల ఇన్చార్జి జివిఎస్.రాజేశ్వరరావు, షార్ట్ ఫిల్మ్ విభాగం కార్యదర్శి ఎం.ఎల్లాజీ, సభ్యులు కె.సంతోష్కుమార్ పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : అంతర్జాతీయ మాత భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి, ఆంధ్ర భవన్ (ప్రైమరీ, హయ్యర్ సెకండరీ స్కూల్) సంయుక్త నిర్వహణలో తెలుగు భాషా విశిష్టతపై తెలుగు విభాగ సమావేశ మందిరంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, ఎయు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తదితరులు మాట్లాడారు.

నక్కపల్లి:తెలుగు భాష పై మక్కువ పెంచుకోవాలని ప్రముఖ కవి, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు తేజోమూర్తుల వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఎం సి.హెచ్. సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయులు ఎన్వివిఎస్ ఆచార్యులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కవి, విశ్రాంత ఉపాధ్యాయులు తేజోమూర్తుల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మున్నీషాబేగం, పాఠశాల ఉపాధ్యాయులు ఎన్వివిఎస్ ఆచార్యులు, ఎస్. ఫల్గుణరావు, చిన్నారావు, ఎ.వి.ఎల్.ఎన్ . కుమారి , రమేష్ బాబు , శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం:అంతర్జాతీయ మాతృభాషా దినోత్స వాన్ని రాచపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగుతల్లి చిత్రపటానికి ఎంఈవో మూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనకాపల్లి : తెలుగు భాష ఔన్నత్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం పేర్కొన్నారు. అనకాపల్లి పట్టణంలోని వన్ వే ట్రాఫిక్ జంక్షన్ తెలుగుతల్లి విగ్రహం వద్ద అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ముందుగా తెలుగు తల్లి విగ్రహానికి నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పట్నాల కష్ణ మోహన్, వినకోట నీలేశ్ గుప్తా పాల్గొన్నారు.

చింతూరు : అల్లూరి జిల్లా చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం మాట్లాడుతూ ఏ దేశానికి వెళ్లినా అమృతం వంటి మాతృభాషను మరిచిపోకూడదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.శేఖర్, తెలుగు విభాగాధిపతి కె శ్రీదేవి, కంప్యూటర్ అధ్యాపకులు, కవి నూనె రమేష్, అధ్యాపకులు వై.పద్మ, జి.హారతి, కె.శకుంతల, ఎస్.అప్పనమ్మ, కె.శ్రీలక్ష్మి సిహెచ్.రాజబాబు, ఆర్.మౌనిక, జి. సాయికుమార్, పి. అలివేలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

పెందుర్తి: అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం సందర్భంగా శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ బి.సూర్యకళ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'మాతృభాష'అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు ఉమ, జగదీష్ వ్యవహరించి, ఎనమిది మంది విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

విప్లవ సారధి లెనిన్ జీవితాన్ని అధ్యయనం చేయాలి

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పలుచోట్ల బుధవారం రెడ్బుక్ డే నిర్వహించారు. (ప్రజాశక్తి -యంత్రాంగం)



లెనిన్కు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ఎంవిపి కాలనీ : రష్యా విప్లవ సారధి వి.ఐ.లెనిన్ జీవితాన్ని అధ్యయనం చేస్తే ప్రస్తుత భారతదేశ దోపిడీ వ్యవస్థపై ఉద్యమాలు ఎలా చేపట్టాలో అర్థం అవుతుందని మార్క్సిస్టు పత్రిక సంపాదకులు ఎస్.వెంకటరావు చెప్పారు. మార్క్స్, ఏంగెల్స్ రచించిన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక పుస్తకం విడుదల చేసిన ఫిబ్రవరి 21న రెడ్ బుక్ డేగా ప్రపంచవ్యాప్తంగా జరుపుతు న్నందున మద్దిలపాలెం పిఠాపురం కాలనీలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో రెడ్బుక్డే నిర్వహించారు. ప్రజాశక్తి పత్రిక విశాఖ ఎడిషన్ పూర్వ మేనేజర్ ఎస్.సుధాకర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, లెనిన్ శత వర్ధంతి పురష్కరిం చుకొని ఈ ఏడాది అంతటా లెనిన్ జీవితాన్ని అధ్యయనం చేయాలన్నారు. ముఖ్యవక్త వెంకట రావు మాట్లాడుతూ, రష్యాలో జార్చక్రవర్తి పరిపాలన కూల్చి కార్మిక రాజ్యం స్థాపించడానికి లెనిన్ కృషి అమోఘమన్నారు. కారల్ మార్క్స్, ఏంగెల్స్ రచించిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టి నాణ్యతకలిగిన కమ్యూనిస్టు పార్టీని నిర్మించి రష్యాలో 1917లో విప్లవానికి లెనిన్ నాయ కత్వం వహించారన్నారు. దోపిడీ వ్యవస్థను కూల్చేందుకు విప్లవకర పార్టీగా సిపిఎం కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జివిఎన్.చలపతి, రమాదేవి, వి.కృష్ణారావు, ఎంవి.త్రినాధరావు, జివి.రమణ, కె.కుమారి, ఎం.చంటి, ఎన్.అజయ్, జి.రాము, అరుణ్కుమార్ తదితరులు పాల్గొని లెనిన్ జీవితం కృషి అనే పుస్తకాన్ని పఠించారు.

గాజువాక సిపిఎం కార్యాలయంలో రెడ్ బుక్ డే

గాజువాక : స్థానిక సిపిఎం కార్యాలయంలో లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని రెడ్ బుక్డే నిర్వహించారు. కె.కిరీటం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు పాల్గొని మాట్లాడారు.

పాత్రికేయులపై దాడులకు సర్వత్రా నిరసన

పాత్రికేయులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ అల్లూరి, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో బుధవారం జర్నలిస్టులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. టిడిపి, జనసేన పార్టీలు దాడులను ఖండించాయి.

(ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగ)

మధురవాడ :రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి పత్రికా జర్నలిస్ట్పై వైసిపి నేతల దాడి ఘటనను ఖండిస్తూ టిడిపి, జనసేన ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఎండాడ ఎస్సి కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. టిడిపి 8వ వార్డు అధ్యక్షులు చెట్టుపల్లి గోపి, జనసేన నేత చంద్ర సత్యనారాయణ, తాటిచెట్టి గణేష్, కొర్రాయి అనిల్, సుంకర హరి, గద్దిపల్లి శివాజీరావు, దుర్గా రమేష్, గద్దిపల్లి శ్రీరామ్, కొరగంజి సంతోష్, బాలి వెంకటరావు, తెలుగుమహిళ మంగా దేవి, సారిపల్లి శ్రీను, ఉప్పులురి గోపి, చెట్టుపల్లి సన్యాసిరావు, బొడపుడి దొరబాబు, అక్కరమాని రాంబాబు, ఓమ్మి బాబురావు, బెళ్ళన శ్రీను, పత్తి మురళిపాల్గొన్నారు

రాజవొమ్మంగి : రాప్తాడు వైసిపి సభలో ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ బుధవారం రాజవొమ్మంగిలో జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజవొమ్మంగి ప్రెస్క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి బాలరాజు, రామరాజు, గౌరవ అధ్యక్షులు పి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సభకు సంబంధించిన దృశ్యాలను చిత్రీకరిస్తున్న ఫోటోగ్రాఫర్పై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరచడం అన్యాయమన్నారు. ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు కె శివప్రసాద్, టి వీర్రాజు, ఏ సూరిబాబు, కె కృష్ణ, పి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు డివిజన్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ఎపిడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఎపిలో జర్నలిస్టులపై జరుగుతున్న వరస దాడులపై బుధవారం నిరసన తెలిపారు. చింతూరు ఎయస్పి కార్యాలయంలో రంపచోడవరం ఒఎస్డి మహేశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం డివిజన్ కేంద్రంలో ప్లకార్డులతో నిరసన ర్యాలీ నిర్వహించి, ఐటిడిఎ ఎపిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మంత్రి సత్యనారాయణ, విజయ్, జానీ, ఎస్కే షాజహాన్, ఆసిఫ్, ఈశ్వరచారి, శ్రీనివాసచారి, సత్యనారాయణ, చంటి, రాజేష్ రెడ్డి పాల్గొన్నారు. జర్నలిస్టులపై దాడిని టిడిపి మండల నాయకులు



చింతూరులో నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టులు

ఇళ్ల చిన్నారెడ్డి, మల్లెల వెంకటేశ్వరరావు, జి సురేష్కుమార్, శీలం తమ్మయ్య, కుంజ బాలకృష్ణ, పీసం దూలయ్య, జి.రంజిత్కుమార్, పి.రామారావు తీవ్రంగా ఖండించారు.

అనకాపల్లి : పత్రికా కార్యాలయాలు, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడండి... మీడియాపై దాడులను అరికట్టాలని పాత్రికేయులు నినాదాలు చేశారు. ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు భీమరశెట్టి వెంకటేష్, బి.కొండలరావు, పి. నాగశ్రీను, పి.రామారావు, ఎస్.కె చాంద్ బాషా, తిమ్మాపాత్రుని రమేష్, కాండ్రేగుల మోహన్ బాబు పాల్గొన్నారు.

మీడియాపై దాడి హేయం : నాగజగదీష్

అనకాపల్లి : ప్రశ్నించే గళం వింటే జగన్ రెడ్డికి వణుకని, అందుకే ఆయనకు ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, మీడియా అంటే భయమని, తన భయాన్ని కప్పిపుచ్చుకునేందుకే మీడియాపై దాడులు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చొక్కాలు మడత పెట్టండి అంటూ జగన్రెడ్డి సభలలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో వైసిపి కార్యకర్తలు మీడియా ప్రతినిధులపై, సంస్థలపై దాడులకు తెగబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లాలం కాశీనాయుడు, కొణతాల వెంకటరావు పాల్గొన్నారు.

సమాజ హితంగా శాస్త్ర పరిశోధనలు

- గీతంలో 'భట్నాగర్'కు ఘననివాళి

ప్రజాశక్తి -మధురవాడ : సమాజ హితానికి విజ్ఞానశాస్త్ర పరిశోధనలు దోహదపడాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్. కృష్ణ పిలుపునిచ్చారు. సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ 130వ జయంతి సందర్భంగా గీతం వర్సిటీలోని భట్నాగర్ ప్రయోగశాల వద్ద ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,దేశంలో విజ్ఞానశాస్త్ర రంగం అభివృద్ధికి భట్నాగర్ వంటి పరిశోధకుల దూరదృష్టి కారణమన్నారు. వర్సిటీల్లో నిర్వహించే పరిశోధనలు సామాన్యులకు చేరువ కావాలన్నారు.శాంతిస్వరూప్ భట్నాగర్ను సైన్స్ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ వేదవతి, సైన్స్ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చి స్కాలర్స్ పాల్గొన్నారు. .

దాతల సాయంతో బెంచీల ఏర్పాటు

ప్రజాశక్తి -భీమునిపట్నం : దాతల సాయంతో భీమిలి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సిమెంట్ బెంచీ ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రజల సౌకర్యార్థం పలు ప్రాంతాల్లో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసిన అసోసియేషన్, ఇదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేసిన జి నరసింహప్పడు జ్ఞాపకార్థం అతని కుమారుడు ఐపిఎస్ అధికారి క్రాంతికుమార్ ఆర్థిక సాయంతో సిమెంట్ బెంచీని ఏర్పాటు చేశారు. క్రాంతికుమార్ తల్లి వెంకటరత్నం దీన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సన్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, బిఎస్ఎఫ్ విశ్రాంత కమాండెంట్ కె.బాబ్జీ, డాక్టర్ కాళ్ల లావణ్య, అసోసియేషన్ ప్రతినిధులు ఎం.సూర్య శ్రీనివాస్, పి దేవానంద్, జి పార్వ తీశం పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు

ప్రజాశక్తి -తగరపువలస : వెన్నుపూస సమస్యతో కొంతకాలంగా మంచానికే పరిమితమైన స్థానిక కొత్తపేటకు చెందిన బాలాజీ అనే నిరుపేద యువకుని కుటుంబానికి ఫుట్బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అక్కరమాని చిన్నబాబు బుధ వారం నిత్యావసర సరుకులతో పాటు రూ.వెయ్యి నగదు సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వేంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు వి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు

నిర్వాసితుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్ప్లాంట్ భూసేకరణ విభాగం ఎస్డిసిగా బాధ్యతలు స్వీకరించిన డి సునీతను బుధవారం సిపిఐ నేతలు కలిశారు. నిర్వాసితుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇంటర్వ్యూల జాబితాలో ఉన్న 260మంది నిర్వాసితులు నాలుగేళ్లుగా శాశ్వత ఉపాధికి ఎదురుచూస్తున్నారని, తక్షణమే వారికి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎస్డిసి సునీత స్పందిస్తూ, తాను బాధ్యతల్లోకి వచ్చి నాలుగు రోజులే అయినందున సమస్యలపై పూర్తి అవగాహన లేదని, ఉన్నతాధికారులత మాట్లాడి న్యాయం చేస్తానన్నారు.ఎస్డిసిని కలిసిన వారిలో సిపిఐ పెదగంట్యాడ కార్యదర్శి యేల్లేటి శ్రీనివాసరావు, పి దుర్గారావు, వై దేముళ్ల, ఎన్ తాతారావు ఉన్నారు..

అప్పారావుకు ఘనసన్మానం

ప్రజాశక్తి -పద్మనాభం : పంచాయతీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేవిడి గ్రామానికి చెందిన మరగడ అప్పారావును నియమించారు. బుధవారం స్థానిక వైసిపి మండల కార్యాలయంలో అప్పారావును పార్టీ మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, ఎంపిపి రాంబాబు దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు..

జనసేన మండల ఉపాధ్యక్షునిగా శివకృష్ణ

ప్రజాశక్తి-ఆనందపురం: జనసేన మండల ఉపాధ్యక్షులుగా శివకృష్ణ తాడివాడను నియమించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాలు, పార్టీ రూరల్ అధ్యక్షులు పంచకర్ల రమేష్బాబు సూచనల మేరకు, భీమిలి నియోజకవర్గ ఇన్ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల ఈ మేరకు నియామక ఉత్తర్వులు ఇవ్వడపై ఆనందం వ్యక్తం చేశారు.

కాలిబాట ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి -తగరపువలస : చిల్లపేట, చిట్టివలసపెద్ద చెరువుకు ఆనుకుని ఉన్న తమ పంట భూములకు కాలిబాట ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరారు. బుధవారం పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేసిన జెడ్సి కె.కనకమహాలక్ష్మి దృష్టికి సమస్యను తెచ్చిన రైతులు వినతిపత్రం అందజేశారు. చెరువు సుందరీకరణలో భాగంగా తవ్వే మట్టిని తమ భూముల్లోకి వెళ్ళడానికి వీల్లేకుండా అడ్డుగా వేస్తున్నారని రైతులు చేట్ల ఎల్లయ్యరెడ్డి, త్రినాథరెడ్డి, మరో 35మంది రైతులు విన్నవించారు.